ఆ పడినవాడు మళ్ళీ లేవలేదు.

‘అ(రే!..... ఇందాకట్నుండీ తలుపులు గడియవేసి ఉన్నాయనుకున్నా..... తీసే ఉన్నాయే..... ఇదెక్కడ చచ్చిందీ.....’ అంటూ లోపలికి అడుగు పెట్టాడు వీరూ.

క్షణం ఆలస్యం చేయకుండా తలుపు వెనుకనుండి వీరూ గుండుమీద గడ్డుకర్రతో ఒక్కటిచ్చాడు కిష్టయ్య.

‘హా బాస్......హా జగ్గూ......’ అంటూ కుప్పకూలిపోయాడు వీరూ.

రాంబాబు కిష్టయ్య బయటికి పరుగెత్తి ఇంటితలుపులు బయటినుండి గడుయ పెట్టారు.

***ఛలో హైదరాబాద్***

అక్కడ తాడేపల్లి గూడెంలో ......

పరధామయ్య వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు.

అప్పుడే వీధిలో జీపు ఆగింది. దాంట్లోంచి ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్ళూ దిగారు.

పోలీసుల బూట్ల చప్పుడుకి పరంధామయ్య తలెత్తి చూశాడు.

‘పోలీసులు ఇక్కడికెందుకొచ్చారబ్బా?!.....ఇదేదో గందరగోళం వ్యవహారంలాగా ఉందే?....’ అనుకున్నాడు పరంధామయ్య.

ఇన్‌స్పెక్టర్ గబగబా ముందుకు వచ్చి పరంధామయ్య వంకచుసి ‘మీరేనా రాంబాబు?’ అని అడిగాడు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్ళలో ఒక కానిస్టేబులు కంగారుపడిపోయి ఇన్‌స్పెక్టర్ చెవిలో ఏదో చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ తక్షణం నాలుక కొరుకున్నాడు.

‘ఆ.....అదీ..... అహ్హా ..... మరీ .....మీరేనా ప్రముఖ స్మగ్లర్, హంతకుడు రాంబాబు తండ్రి?’ అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఈసారి పరంధామయ్య కంగారు పడ్డాడు.

‘నేను రాంబాబు తండ్రినే!......కానీ మావాడు స్మగ్లరూ, హంతకుడు మాత్రం కాదు’

మరుక్షణం ఇన్‌స్పెక్టర్ జేబులోంచి ఒక ఫోటో తీసి పరంధామయ్యచేతికి ఇచ్చాడు.

‘ఆ ఫోటోలోంచి వ్యక్తి మీ అబ్బాయేనా?’ అంటూ సూటిగా పరంధామయ్య మొహంలోకి చూస్తూ అడిగాడు.

‘కాదు ..... అయినా ఇందులో ఉన్నది అమ్మాయిగా?.....’ అన్నాడు పరంధామయ్య.

ఇన్‌స్పెక్టర్ కంగారుగా ఆ ఫోటో పరంధామయ్య చేతిలోంచి లాక్కున్నాడు.

అది అతని ప్రియురాలి ఫోటో.

‘ఛీ....నా మతి మండా......’ అని నెత్తిన ఒక మొట్టికాయ మొట్టుకుని వేరే జేబులోంచి ఇంకో ఫోటోతీసి ఈసారి దానివంక చూసి తృప్తిగా తలపంకించి పరాంధామయ్య చేతికిఇచ్చాడు.

‘ఇప్పుడు చెప్పండి..... ఆ ఫోటోలోని వ్యక్తి మీ అబ్బాయేనా?’

‘మా అబ్బాయే.....వీడే రాంబాబు.....ఏం?’ అన్నాడు పరంధామయ్య ఫోటోవంక చూస్తూ.

‘అయితే మీ అబ్బాయి స్మగ్లర్...... హంతకుడు అన్నమాట’ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

‘కానీ వాడు అలాంటివాడు కాదండీ...... మీరేదో పొరబాటుపడ్తున్నారు ......వాడు ఫోటో గ్రాఫర్..... హైదరాబాద్‌లో ఇస్మైల్ ప్లేజ్ ఫోటో స్టూడియో ఉంది వాడికి.....’

అదీ సైడ్ బిజినెస్సండీ...... మీ వాడికి స్మగ్లింగ్, హత్యలు చేయడమే అసలు బిజినెస్ అయినా ఇటువంటి పనులు ఇంట్లో వాళ్ళకి చెప్పి చేస్తారా ఎక్కడైనా? ..... మాకు హైదరాబాద్ నుండి ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చాయ్ రాంబాబు ఇక్కడ ఉండొచ్చుననీ, పట్టుకుని అరెస్టు చేయమనీ....... కానిస్టేబుల్స్...... లోపలికి వెళ్ళి రాంబాబుని వెతికి పట్టుకుని చేయండి......’

ఇద్దరు కానిస్టేబుళ్ళూ లోపలికి వెళ్ళి వెతికి ‘రాంబాబు లోపల లేడు సార్......’ అనుకుంటూ బయటికి వచ్చారు. వాళ్లతోబాటు రాంబాబు తల్లి పార్వతమ్మా. చెల్లెలు రాజ్యలక్ష్మి ఇద్దరూ కంగారుగా బయటికి వచ్చారు.

‘ఏవిటండీ ఈ గొడవ .....వీళ్ళు మన అబ్బాయికోసం ఎందుకు వెదుకుతున్నారు?’ అంది పార్వతమ్మ.

‘మన రాంబాబు స్మగ్లరట..... అందుకని వచ్చారట.....’ చెప్పాడు పరంధామయ్య దిగులుగా.....

‘హాయ్!.... అయితే అన్నయ్య దగ్గర బోల్టు బంగారు బిస్కెట్లు ఉంటాయి కదమ్మా.... వాటితో నాకు మంచి నక్లెసులు చేయించవే .....’ అంటూ గారాలుపోయింది రాజ్యలక్ష్మి.

‘మీ అన్నయ్య దగ్గర ఉన్న బంగారు బిస్కెట్లన్నీ మేము స్వాధీనం చేసుకుని మీ అన్నయ్యని మేము జైలుతో పెడ్తాం .......’ అన్నాడు ఇన్‌స్పెక్టర్ పళ్ళు నూరుతూ.

రాజ్యలక్ష్మి బిక్కమొహం వేసింది.

పార్వతమో ......లోపలంతా సరిగ్గా వెతికారా?’ అడిగాడు ఇన్‌స్పెక్టర్ కానిస్టేబుల్సును.

‘వెతికాంసార్..... మంచం కింద, సోఫాలక్రింద అలమారల్లో, బీరు హాల్లో అన్ని చోట్లా వెతికాం సార్ ఎక్కడా కనిపించలేదు.....’ అన్నాడు మొదటి కానిస్టేబుల్.

సార్ ..... ఇక్కడ తూర్పు వీధిలో రాంబాబుకి కాబోయే మామగారు? ఉన్నారని విన్నానుసార్..... ఆయన పేరు రాఘవేంద్రరావు అటసార్...... రాంబాబు అక్కడ తలవాచుకున్నాడేమో చూద్దామా సార్?’

‘గుడ్ .....ఇలా కేసుకి సంబంధించిన ముఖ్యమైన ఇన్‌ఫర్మేషన్ సంపాదిస్తున్నందుకు నీకు ప్రమోషన్ కోసం పైకి రికమెండ్ చేస్తా....పదండి అక్కడికి పోదాం....

ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ళు అక్కడినుండి నిష్క్రమించారు.

ఏడుస్తున్న పార్వతిని పరంధామయ్య ఊర్కోబెట్టాడు.

‘పోలీసులేదో పొరబాటు పడి ఉంటారు......లేదా రాంబాబుని పోలిన మనిషి ఇంకోడెవడో ఉండి ఉంటాడు..... మనం వెంటనే హైదరాబాద్

అసలక్కడ కిష్టయ్యగాడైనా ఉన్నాడో లేదో.... అక్కడ ఇంత ఘోరమైన వ్యవహారాలు జరుగుతూ ఉంటే ఇద్దర్లో కనీసం ఒక్క రైన ఉత్తరం రాయలేదేం?.....' విసుక్కున్నాడు పరంధామయ్య.

ఒక అరగంట తరువాత రాఘవేంద్రరావు ధుమధుమలాడుత్తూ వచ్చాడు.

'హు.....మీరింకా ఎంతో మంచివాళ్లని అనుకున్నాను...... తడి గుడలతో గొంతులుకోసే రకం.... మీ అబ్బాయి ఎంతో బుద్ధిమంతుడు అమాయకుడూ అని చెప్పి మాపిల్ల గొంతు కోస్తారా?......' అంటూ పరంధామయ్య మీద మండిపడ్డాడు రాఘవేంద్రరావు.

'మీరేం మాట్లాడుతున్నారో మీకైనా అర్ధమౌతుందా?.....మీ వ్యవహారం నాకేమీ నచ్చలేదు.....' అన్నాడు పరంధామయ్య.

'అబ్బే.....ఏమీ తెలీనట్లు ఏం నటన ?.... మా కంతా  తెలిసిపోయింది. ఇందాకే పోలీసులు మీ అబ్బాయికోసం మా ఇంటికి వచ్చారు...... ఇంకా నయం ముందుగా తెల్సింది కాబట్టి సరిపోయింది .... లేకపోతే పిల్ల బతుకన్యాయం అయిపోయి ఉండేది ..... ఇలాంటి పనికిమాలిన సంబంధం మాకొద్దు.....'

'మాటలు జాగ్రత్తగా రానీయండి..... ఎవరిది పనికిమాలిన సంబంధం ?..... మీదే పనికిమాలిన సంబంధం ఈ సంబంధం వద్దని మీరు ఈ రోజు మాతో అంటున్నారుగానీ....మేము మేము ఎప్పుడో మీ సంబంధం మానుకున్నాం. మీ అమ్మాయి గురించి మాకు తెలీదనుకోకండి'

ఏం?..... మా అమ్మాయి కూడా స్మగ్లింగ్ చేస్తుందనీ .....హత్యలు చేస్తుందనీ మీకెవరైనా చెప్పారా' వెటకారంగా అన్నాడు రాఘవేంద్రరావు.

'ఒక్క నిమిషం ఉండండీ మీరే చూస్కుందురుగాని .....' అంటూ లోపలికి వెళ్ళి సుబ్బలక్ష్మి నాగరాజుతో ఉన్న ఫోటోని తీసుకొచ్చి రాఘవేంద్రరావు చేతిలో పెట్టాడు.

ఫోటోని చూస్తూనే రాఘవేంద్రరావు నోరు తెరిచాడు.

'హొర్ని ...... హైదరాబాద్ హాస్టల్లో ఉండి బుద్దిగా చదువుకుంటూ ఉందనుకుంటే ఇది చేసే నిర్వాకం ఇదా?.....ఈ వేళే హైదరాబాద్ వెళ్ళి దీని సంగతి తెల్చాలి!!........' అనుకున్నాడు రాఘవేంద్రరావు.

ఆరోజు రాత్రే పరంధామయ్య, పార్వతమ్మ రాంబాబు గురించి రాఘవేంద్రరావు వర్ధనమ్మలు సుబ్బలక్ష్మి గిరించీ హైదరాబాద్ బయలుదేరి వెల్లారు.

***హా! బాస్! హా! వీరూ!***

వీరూ ఇంటినుండి బయట పడిన తరువాత రాంబాబూ కిష్టయ్యా లక్డీకాపూల్‌లోని జగ్గూ ఇంటికి ఖాకీ బట్టలేసుకుని మారు వేషాల్లో బయలుదేరారు.

ఇల్లు సులభంగానే దొరికింది .

రాంబాబు తలుపు తట్టాడు.

మెల్లగా తలుపు తెరుచుకుంది. తలు పుల మధ్యలోంచి తలకాయ్ కనిపించింది. అది

'కరెంట్‌మీటర్ రీడింగ్ తీసుకోడానికి వచ్చాం' అన్నాడు రాంబాబు.

'మీటర్ రీడింగా?.... మొన్ననే తీస్కున్నారుగా? ఎన్నిసార్లు తీస్కుంటారు?' విసుగ్గా మొహం పెట్టి అన్నాడు జగ్గూ.

రాంబాబు తెల్లమొహం వేశాడు.

వెంటనే కిష్టయ్య అన్నాడు.

'మొన్నా..... వాడే యాదగిరే కదా వచ్చాడు?'

'ఏమో....అతనిపేరు నాకెలా తెలుస్తుంది? వచ్చి మిటర్ రీడింగ్ తీస్కుని వెళ్లాడు'

'ఇంకెవరూ వాడే .....యాదగిరే....వాడు అన్నీ తప్పుడు రీడింగ్‌లు తీసుకున్నాడు ..... మళ్ళీ మేము రీడింగులు తీసుకోవాల్సి వచ్చింది. మాకు డబల్ పని అయిపోయింది' అన్నాడు కిష్టయ్య.

రాంబాబు కిష్టయ్యవంక మెచ్చుకోలుగా చుశాడు.

'మీటరేది?....' జగ్గూని అడిగాడు కిష్టయ్య.

'లోపలికి రండి' ముఖం చిట్లించుకునే తలుపుకి అడ్డు జరిగాడు జగ్గూ.

ఇద్దరూ లోపలికి వచ్చి చిన్న నోటు పుస్తకం తమ దగ్గరున్న సంచిలోంచి తీసి మీటర్ రీడింగ్ అందులో నోట్ చేశారు.

'వెళ్ళక ఇక్కడెందుకు కూర్చుంటాం...... ఇంకా బోల్డు ఇళ్లకి వెళ్ళి రీడింగ్స్ తీసుకోవాలి!' అన్నాడు రాంబాబు.

'ఈయన జుట్టుచూడు రింగులు రింగులుగా దుబ్బుగా ఎంత బాగుందో!' అన్నాడు కిష్టయ్య రాంబాబుతో జగ్గూ జుట్టువంక చుస్తూ.

'ఆ ఏం బాగుండడమోలే .....ఇంకో సంవత్సరానికి పూర్తి బట్టతల వచ్చేస్తుంది......ఇప్పుడే కాస్తకాస్త వస్తుంది.....'అన్నాడు రాంబాబు.

జగ్గూ కంగారుపడిపోయాడు. దుబ్బులా ఆ జుట్టు అలా ఉండబట్టే తనలో రౌడికళ ఉంది. అది ఊడి పోయి బట్టతల వచ్చిందంటే తను రౌడీ అంటే ఎవరూ నమ్మరు....ఎవరూ తనకి భయపడరు .

'నాకు బట్టతల వస్తుందా? ..... లేదే ....అద్దంలో రోజు చూస్కుంటుంటానుగా ....నాకెప్పుడూ అనిపించలేదే!!.....' కంగారుగా అన్నాడు జగ్గూ.

'అవునుగానీ మీ ఇంట్లో ఎవరూ లేరా?' అడిగాడు కిష్టయ్య.

'లేరుగానీ నాకు బట్టతల వస్తుందా?' జుట్టు తడుముకుంటూ అడిగాడు జగ్గూ.

'మీ ఆవిడ కూడా లేదా?'

'నాకు పెళ్ళికాలేదు...నాకు బట్టతల వస్తుందా....నాకు కనిపిండం లేదే!......'

'మీకెలా కనిపిస్తుంది? ..... అది నడినెత్తిన వస్తుంది. మబ్బుల మాటున చందమామలా మీ బుర్రకాయ్ కాస్త కాస్త కనిపిస్తుంది.....' అన్నాడు రాంబాబు.

ఛా.....ఏం లేదుసర్ ఆయనేదో అలా అంటున్నాడు....'జగ్గూ తో అన్నాడు కిష్టయ్య.

'ఎందుకులేదూ....ఉంది....నువ్వు పొట్టి..... అందుకే నీకు కనిపించడంలేదు......'

'లేదు......' కిష్టయ్య రెట్టించి అన్నాడు.

'ఉంది .....కావలిస్తే ఆయన్ని వంగమను.... అప్పుడు నీకే కనిపిస్తుంది.......' రాంబాబు సవాల్ చేశాడు.

'మీరు కాస్తతల వంచండిసార్......మీకు బట్టతల వచ్చిందేమో చూస్తాను..... నిజంగా మీకు బట్టతల వచ్చిందేమో చూస్తాను....నిజంగా మీకు బట్టతలు వస్తుంటే మా తాతయ్య దగ్గర మంచి ఆయుర్వేదం మందుంది. అది తెచ్చి మీకిస్తాను........ అది రాస్తే జుట్టురాండం ఆగిపోతుంది...... ఊ..... వంగండిమరి' అన్నాడు కిష్టయ్య.

జగ్గు అయోమయంగా చూస్తూ ముందుకు వంగాడు.

క్షణం ఆలస్యం చేయలేదు రాంబాబు. తన చేతిలోని సంచీలోంచి ఇనుపకడ్డీ తీసి జగ్గూ నెత్తిన ఒక్కటిచ్చాడు. మోదిన తరువాత జగ్గూ మూర్ఛపోయాడు.

'హ బాస్......హా వీరూ......' అంటూ నేలకొరిగాడు జగ్గూ.

తరువాత అతన్ని ఇల్లు సోదాచేశారు ఇద్దరూ. వాళ్లకి ఏమీ కనబడలేదు.

అక్కడి నుండి కిష్టయ్య స్టూడియోకి, రాంబాబు శ్యామ్రావు ఇంటికి వెళ్ళిపోయారు.

## *ముంచుకొచ్చిన ప్రమాదం*

రాంబాబు ఇందిరా పార్కులో సరోజ కోసం ఎదురుచూస్తూ సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాడు.

అతనిప్పుడు అమ్మాయి వేషంలో ఉన్నాడు. పెద్ద జడ ఉన్న విగ్గు పెట్టుకున్నాడు. జడలో పూలు, గంధం కలర్ గార్డెన్ సిల్కుచీర కట్టుకున్నాడు.

చీర అలవాటులేక పైట మాటిమాటికి జారిపోతుంది.

'ఛీ వెధవ పైట ....నిన్ను పెట్టుకోవాల్సింది......' విసుక్కున్నాడు. సరోజ వస్తుందే మోనని రాంబాబు ఎదురు చూశాడు. రాత్రి అయిపోయింది కానీ సరోజ రాలేదు.

మర్నాడు తెల్లవారుజామే కిష్టయ్య శ్యామ్రావు ఇంటికి వచ్చాడు.

'ఈ వేళ ప్రోగ్రాం ఏంటి గురూగారూ?' అని అడిగాడు.

'ఏమోరా ...నాకేం చెయ్యాలో అర్థంకావడంలేదు. మనం అనుమానించిన ఇద్దరి దగ్గరా ఏ ఆధారాలు దొరకలేదు.....ఇంకనాకు ఉరిశిక్ష తప్ప దేమో!' దిగులుగా అన్నాడు రాంబాబు.

'సరోజగారు ఏమన్నారు?'

'నిన్నటినుండీ ఆమె రాలేదు....ఎందుకు రాలేదో ఏమో.....సరోజకి ఫోన్ చెయ్యి .....' అన్నాడు రాంబాబు.

కిష్టయ్య బయటికి వెళ్ళి పది నిమిషాల్లో వచ్చాడు.

'ఫోన్ చేశావా?'

'చేశాను గురూగురూ.....తన ఇంటిమీద పోలీసుల నిఘా ఉందేమోనని అనుమానంగా ఉందిట. తను ఇక్కడికి వస్తే పోలీసులకి మీ ఆచూకి తెలుస్తుందని రాలేదట. ఇప్పుడు పది గంటలకి ఇందిరా పార్కుకి రమ్మంది...... తను అక్కడికి వస్తానంది.......' చెప్పాడు కిష్టయ్య.

'కానీ సి.ఐ.డీ.లు  ఆమె ఇంటిమీద కన్నేసి ఉంటే ఆమెను కూడా ఫాలో అయి వాళ్ళు కూడా వస్తారు. అప్పుడు రాంబాబు దొరికిపోతాడు' అన్నాడు శ్యామ్రావు.

'కానీ గురూగారూ మారువేషంలో ఉంటారుగా?'